# తిరుపతి కొండ మెట్టు

శ్రీ తిరుమల మహాపుణ్యక్షేత్రంలో గాలిగోపురానికి పోయే మొదటి మెట్లవరుసలో సగం దాటినపైన, ఏకాకి కుంటి బిచ్చగాడు పున్నెడు నివాసం.

ఏ బిచ్చగాళ్ళ ఋషికులానికీ చెందకుండా పున్నెడు ఆశ్రమం ఏర్పరచుకున్నాడు. రెండు కాళ్ళూ మొండే! కాని వాడికున్న బలం విపరీతం. వాడుచేసే దొమ్మరవిద్యల సాహసం నైపుణ్యం ఏ ఇసాకో గ్రాండ్ రషియను సర్కసు జట్టులో ఉండే పరమ సాహసికీన్ని లేదు.

చేతులతో మెట్లెక్కుతాడు. కోతిలా కొమ్మనుంచి కొమ్మకు ఎగిరి ఛంగునపోతాడు. వేళ్ళాడుతూ చక్రంలా గిరగిర తిరుగుతాడు. దేహమంతా వాలఖిల్యమునిలా పైకెత్తి వేళ్ళ మీద తలకిందులా నిలబడి నడుస్తాడు. మెట్టుమీద నిలుస్తూ, చేతుల్లోంచి దూరుస్తాడు. ఆతని విచిత్రపు ఆసనాలూ మొగ్గాలూముందు హఠయోగి విరూపాక్షానందుడుగాని, జపాను సర్కసువీరుడు మసుకాకోగాని విన్యాసంచేసే ఆసనాలూ మొగ్గలూ వేయి కొవ్వువత్తుల విద్యుత్ దీపంముందు ఆముదందీపంలా తెలతెలపోవలసిందే.

యాత్రికులతండాలు మేఘాలులా పున్నెడు ముందర చేరి, ఆతని అద్భుతమైన మొగ్గలు, పనులుచూసి ఆశ్చర్యంతో దమ్మిడీలు, కానులు, అణాలు వర్షంకురిపిస్తే రాత్రి తొమ్మిది అయ్యేసరికి అయిదూ, ఆరు రూపాయలచిల్లర చెరువులుకట్ట

వలసినదే. ఏ బ్రహ్మోత్సవమో అయితే, పది, పదిహేను రూపాయల వరదలుకట్టాయి.

తిరుపతికొండల ఎక్కుడు దిగుడుల ఏడు మైళ్ళలో ఉన్న నాల్గువందల ఏబదియారు బిచ్చగాళ్ళలో, పున్నెడుకు వచ్చేరాబడి ఇంక ఎవరికీలేదు.

వికలాంగులు ఉన్నారు. ముక్కు నోరు అంతా ఏకరం ధ్రిమైనవారున్నారు. కుష్ఠురోగులు, మాంత్రికులు, సన్యాసులు, ముళ్ళమీద హంసతూలికాతల్పంమీదలా పండుకొనే యోగీశ్వరులు, గుడ్డివారు, కోకిలకంఠముతో పాడే గాయకులు, ఆడవాళ్ళు, మగవాళ్లు, బిడ్డలు. భయం కలుగజేసేవి, వట్టిమొద్దుని కళాసౌందర్యం వెల్లివిరిసేవి విగ్రహాలను ముందుంచుకొని పూజారిపనిచేసే భక్తులు — ఎన్ని రకాలున్నారో తిరుమలేశ్వరుని కొలువుచేసే అయ్యంగార్లు, అయ్యరులు, అయ్యాలు, రెడ్లు, మొదలియార్లు, సెట్లు, పిళ్ళలతోపాటు, కోతులతోపాటు ఈ బిచ్చకుల బృందాలు!

## 2

ఆ విచిత్రప్రపంచంలో ఉన్న బిచ్చగాళ్ళంతా పున్నెణ్ణి చూసి అసహ్యించుకునేవారు. పున్నెడు ముష్టివాళ్ళందరికి విరోధిఅయిపోయినాడు. అతడిసంపాదన వాళ్ళకడుపుల్లో మంటలు చెలరేగజేసింది. వారికి ఉడుకుబోతుతనం కాశ్మీరదేశాన్ని సహారాఎడారి చేయగల శక్తితో విజృంభించింది. వితరణప్రవాహాలు పున్నెడుదగ్గిర ఆనకట్టకట్టబడి అక్కడ మహాసరస్సై, తక్కినపడుకొండలూ నిర్జల వాహినులుగాప్రవహిస్తున్నవి.

పున్నెణ్ణి త్వరగా కొండమీదనుంచి జపానువాడు మంచూరియా ఆక్రమించుకొని చీనారాజ్యాన్ని తరిమినట్లు నెట్టివేయాలని బిచ్చగాళ్ళసంఘంలో ఉద్యమం బయలుదేరింది. బిచ్చగాళ్ళలో ఏ కబురైనా తీగలేని వార్తయి శేషాచలం అంతా నిమేషంలో ప్రసరిస్తుంది. మోకాళ్ళపర్వతం, చుక్కల పర్వతం సన్నిధిపర్వతం అన్నీ ఆ వార్త ఆక్రమిస్తుంది. పున్నెణ్ణి శ్రీ వెంకటేశ్వర సర్వహిత భక్తబృందంలోంచి రెండువేల మైళ్ళన్నా విసిరివేసేందుకు ఒక మాఘశుద్ధ ఏకాదశినాడు బిచ్చకుల ఆ ఆశ్రమాలన్నీ తీర్మానించుకున్నాయి. దీనికి కారణం ఏమిటంటే ఆ ఏకాదశి ఉదయంనుంచి పున్నెడికి మధ్యాహ్నానికి ఇరవై అయిదురూపాయలు వచ్చాయి. ఇంకావస్తున్నాయి. సాయంకాలానికి ఈ తీర్మానం!

ఈ తీర్మానముప్రకారం బిచ్చగాళ్ళకు అన్నము సాంబారు అమ్మేవాళ్ళు పున్నెడికి అమ్మడం మానివేశారు సరుకులు. ఏడుమైళ్ళ దారిపొడుగునా విక్రయించేవాళ్లు విక్రయించడం మానివేశారు.

## 3

పున్నెడు మొదట వేళాకోళ మనుకున్నాడు. క్రింద ఆశ్రమంలో ఉన్న దిగుడుబావిలోనుంచి పై ఆశ్రమాలవాళ్ళకీ విడి బిచ్చగాళ్ళకీ అమ్మేమనిషి అలివేలు పున్నెణ్ణి వెక్కిరించి "నీళ్ళు, నీళ్ళు" అని పున్నెడు గోలపెడుతున్నా, నడుమూ కటి భారం ఆడించుకుంటూ వెళ్ళిపోయింది. పున్నెడికి కళ్లు పచ్చబడ్డాయి.

ఆ స్థలం వదిలి క్రిందికిపోయి నీళ్లు త్రాగిరావచ్చును. కాని పున్నేడున్న అత్యంత లాభదాయకమైన స్థలం యాత్రికులు విశ్రాంతికి ఆగే స్థలం. మెట్లెక్కి వస్తూంటేనే పున్నేడు కనబడతాడు. ఆ స్థలం వదిలితే పున్నేడికి రెండుమూర్లు రూపాయ లిస్తామన్నారు కొందరు బిచ్చగాళ్లు: పున్నేడు ఆ స్థలానికి నెలకు పదిచొప్పున అద్దె, పదిచొప్పున అమ్మకానికీ ఇచ్చి పన్నెండు నెలలకు వెంకటేశ పెరుమాళ్ళ పున్నెమా అని సంపాదించాడు.

చెట్టునీడనే కూలబడి తల ఛాతీమీద వాలిపోగా పున్నేడు తన జీవితంఅంతా తలబోసుకున్నాడు.

## 4

పున్నేడు అనంతపురంజిల్లాలో ఒక గ్రామంలో నివసించే అభిమానవంతుడూ ఆస్థిపరుడూఅయిన రెడ్డి భూస్వామి. ఈ రెడ్డికుటుంబానికి పక్క ఊరులో పెద్ద భూస్వాములైన ఇంకోరెడ్డి కుటుంబానికి సరిహద్దు తగాదావచ్చి కురుపాండవయుద్ధమైపోయింది.

అప్పుడు పున్నేడిపేరు పుణ్యాంరెడ్డి. తండ్రిన్నీ ముగ్గురు అన్నదమ్ములూ వీరస్వర్గం పొందారు. వారితోపాటు అవతల కక్షవారూ చాలామంది రంభకోసం పెనగులాడడానికి స్వర్గానికిగూడా ఈ తగాదా తీసుకువెళ్లారు. అవతల కుటుంబంలో ఇద్దరూ, ఇటు పున్నెరెడ్డీ మిగిలారు.

పుణ్యాంరెడ్డి రెండుకాళ్ళూ ఆ యుద్ధంలో విరిగిపోయినాయి. జిల్లా వైద్యాలయంలో రెండుకాళ్ళూ ఛేదించి

మొండిలగ్గణిచేశారు. కుటుంబం యావత్తూ నశించింది. వ్యాజ్యాలలో ఆస్థి ఇదివరకే పోయింది. ఉన్న నాల్గయిదువం దలు పట్టుకొని కతిపయ ప్రియాణాలుచేసి రెండేళ్ళకు వేంక టాచలం సోపానపంక్తిలో రెండవ శేషాచలపతిలా అవతరిం చాడు పుణ్యంరెడ్డి. ఇంక రెండేళ్ళలో పున్నె డయ్యాడు రెడ్డి.

అవతల రెడ్డికుటుంబం ఏమవుతుందో అన్న శిక్ష! భగవంతుడు లేడా అన్న వేదాంతం. బ్రతుకుమీద ఆశతో అతను తిరుపతికొండమెట్లల్లో అవతరించాడు.

## 5

పూర్వ చరిత్రలన్నీ మాయమై పున్నెడికి కళ్ళ రెండు చుక్కలు రాలినవి. అతని గొంతుక ఎండింది. ఆకలి కొండ చిలువలా చుట్టుకుపోయింది. ఎముకలు పిప్పిచేస్తున్నయి.

కొండమీద దుకాణాలకు సరుకు అందుబాటుచేసే వర్త కులు వచ్చినప్పుడు పున్నెడు కొంతడబ్బు వారికియిచ్చి సాయం కాలానికి వంటసామగ్రి తెప్పించుకొనుటకు ప్రయత్నించి డోలీలవాళ్ళకు రెండణాలు చేతిలోవేసి కుండెడునీళ్ళు తెప్పిం చుకున్నాడు! ఆ సరుకుతో, ఆ నీటితో మూడురోజులు గడి పాడు పున్నెడు.

నాలుగురోజులు తెల్లవారగట్ల మూడింటికిలేచి ముష్టికి తయ్యారైనాడు. తెల్లవారేవరకు ఒక రూపాయన్నర మూడు దమ్మిడీలు పోగయినాయి. ఇంతలో మామూలుగా కొండ మీంద దుకాణాలకు సరఫరాదారుడు కందసామి వంటసామగ్రి తెచ్చి ఇచ్చే సమయమైందని కొండపైకి దిగువకూ చూసి

ఆ పక్కనే నాలుగుబారలదూరంలో తాను నిద్రపోయే పొదకడకుపోయి, ఒక పెద్ద రాయితీసి చూసినాడు.

అతని కళ్ళుతిరిగి "అమ్మయ్యో!" అని వెనక్కు వాలి పోయినాడు. ఆ రాతిక్రింద పున్నడు దాచుకున్న అయిదు వందల డెబ్బదిఅయిదు రూపాయల మూట మాయమై పోయింది. పున్నడుప్రాణం నిలువునా కూలబడిపోయింది. రాతిపక్కనే పున్నడూ కూలబడిపోయాడు.

కొంతసేపటికి అతనిమొగం జేవురించింది. తనకు వస్తువులిచ్చే కుప్పుస్వామిగాడే అని అత డనుమానంపడ్డాడు. కుప్పుసామి వాళ్ళజట్టులోవాడు కాడు గనుక తనకు సరుకులిచ్చాడు. ఈ కుప్పుస్వామి రాక్షసుడు. వెంకటేశ్వరుడి ఆస్తే దొంగతనం చేయగల పిశాచి!

వటువ్రేలు తిరిగి కండలుకట్టి, హనుమంతుని హస్తాల వంటి బలమైన అతనిచేతులు భయంకరంగా వంకరలుతిరిగినవి. ఆ సమయంలో ఆతనిచేతుల కందిన ప్రాణి కబంధుని వాతబడినట్లే.

## 6

ఆరోజు దొరికిన డబ్బునిచ్చి వంటసామగ్రి కొనుక్కున్నాడు పున్నడు. ధనంతోపాటు అతని ఉత్సాహమూ శక్తీ పోవడానికి కారణం అలివేలు చర్యే!

అలివేలు ఆ రోజూ అంత నిర్దయగానే నడిచిపోయింది. అలివేలు శేషాచలపతికొండకూ, తనకూ ప్రియమైనది. ఆమె నవ్వు తనకోసం, ఆమెవయ్యారం తనకోసం. ఆమె తన చింపి

జుట్టును దువ్వుకొందంటే తనకోసం! ఆ అలివేలుకూడా తన మీద కక్షవహించింది.

ఆమె తనవైపు చూడలేదు. తలవంపుకు వెళ్ళిపోయింది. తనకు నీరీయలేదు. వెక్కిరించి వెళ్ళిపోయింది. తాను భోజనంచేస్తుంటే అది కబుర్లుచెప్పడానికి రాలేదు. అతనికి జీవితేచ్ఛపోయింది.

కసికొద్దీ అవతలి రెడ్డికుటుంబంనాశనం కోరుతూ జీవించి ఉన్న పున్నంరెడ్డి, పున్నడుగా సంపూర్ణంగా మారి వెనకటి జీవితం మరచి జీవితయుద్ధంలో ఈ విచిత్ర భిక్షుకునిగా నడిపిస్తున్నాడు.

అతనిలోని భిక్షుకత్వభావమూ పోయింది. ఆతడు జీవిత యోధుడు; బ్రతుకొక మహాయుద్ధం. అందులో రోజురోజూ విజయమే! ఆ విజయానికి ప్రేమ, సేవ, కసి, భయం, ఆశ, జీవితావలంబనాలవుతాయి.

ఆ ప్రేమనిధానం పున్నడికి అలివేలు. అలివేలు పెడమోము పెట్టింది. మూలమూలల దాగిఉన్న పున్నడుప్రేమ ఈనాడు అతివ్యక్తమైంది.

ప్రపంచంలో యుద్ధం. క్రమంగా ఒంటిగా సంసారయాత్రచేసే ఆశ అడుగంటింది. తన విద్యలు చూపించి ముష్టి ఎత్తడం మానివేశాడు పున్నడు.

ఆ డబ్బు మాయమైంది. రోజూ వచ్చే డబ్బులేదు. యాత్రికులు పలకరించినా పున్నడు మాట్లాడడు. ఏదైనా జబ్బా అంటే పున్నడు మాట్లాడకుండా ఖండుకొంటాడు.

# 7

అయిదురోజు లయ్యేసరికి పున్నాడు అస్థిపంజరమై పోయాడు.

పున్నాడుదురదృష్టము వెంకటాచలాన్ని రాళ్ళలా ఆశ్రయించిఉన్న వర్తకులు మొదలైన యావన్మందికీ తెలిసి పోయింది.

శేషాచల బిచ్చకులలోకంఅంతా పున్నాడుస్థితికి పండుగ చేసుకుంది. వదులుతాడురా పిశాచి అనుకున్నదా లోకం! అందరికి ఇక కొంచెమో గొప్పో దొరుకుతుంది. ఇంతవరకు పున్నాణ్ణే అదృష్టదేవత ఆవహించింది. ఇంతటినుంచి కొండ మెట్లదారి ఏడుమైళ్ళా కిందికీ పైకీ ఆమె తిరుగుతూఉంటుంది. మళ్లీ ఎన్నాళ్ళకో మంచిదినాలు వచ్చాయిరా అనుకున్నాడు.

నీరసించిపోయిన పున్నాడికి ఆరవదినం రాత్రి స్పృహ వచ్చింది. కొండమీదనుంచి ప్రక్కనున్న లోయలోనికి ఉరికి వెంకటేశపాదసన్నిధి చేరుదామనుకున్నాడు. చేతులతో పాకి నూరడుగుల దూరంలో ఉన్న ఎత్తుబండలమీదికి పోయినాడు. గోవిందా! వెంకటరమణా! ఏడుకొండలవాడా! అని ఉరక బోయినాడు. ఇంతలో చల్లనిచేతులు అతని నడుంబట్టి వెనక్కు లాగివేసినాయి!

## 8

కళ్ళుమూసుకొన్న పున్నెడు శ్రీ వెంకటేశ్వరుడు ప్రత్యక్షమైనాడనుకొన్నాడు. ఆతని దేహం పులకరించింది. చల్లని గాలులు ప్రసరించినట్లయింది. వెన్నెలలు పిండిఆరగా కాచినట్లయింది.

అతను కళ్ళుతెరిచేసరికి ఎట్టఎదుట చుట్టుపక్కల బిచ్చగాళ్ళ ఆశ్రమాలకు నీళ్ళుపోసే పిల్ల అలివేలు కనబడింది. ఆమె తీరైనమోమంతా ఆ వెన్నెల్లో ప్రవాహాలై ప్రవహించే కంటినీరు మెరుస్తూ కనిపించింది.

ఆమె వెక్కి వెక్కి ఏడుస్తూ! "పున్నెడు. నాను బహు పాపిని. నిండా ద్రోగం చేసినా. ఆరుమాసాలక్రితం రోగంవచ్చి దుడ్డులేక సబ్బురపడినప్పుడు నాకు పత్తురూపాయలంపిన నీ సల్లనిగుండెకు నాను ద్రోగంసేశినా! సుక్కలపర్వతం ముసలిదానికి నువ్వుచేసిన సాకిరి దేముడే సేయగల్లు! నీబతుకునిండా దేముడేవున్నాడు. వీళ్ళు పిశాసులు. నాను రక్కసి. వాళ్ళ మాటలకు లోబడి, ఈలా పాపి అయిపోతినిదా! ఓయ్! ఓయ్! నాకు నరకందా రాసినాడే!"

అని పొంకమయిన తన వక్షోజాలు ఉబికిపోగా అతి దీనంగా పొర్లిపొర్లి వచ్చే ఏడుపును ఆపకుండా ఏడ్చింది.

## 9

పున్నెడు నిర్ఘాంతపోయినాడు అలివేలును. నీరసంలో కూడా బలంతగ్గని చేతులతో దగ్గిరకు లాక్కున్నాడు.

"పిల్లా, నాకు కలిగిన ఈ సెబ్బరకు నేను దుఃఖం పొందనేలేదు. ఇంతకుమించి కష్టాలుతీరినవి ఈ ప్రాణికి! కాని అతిమెత్తని నీమనస్సుకు ఎంత రాయితనం వచ్చిందని విచారంపొందినాను. ఎప్పుడూ ఎన్నెల్లుకురిసే నీ చూపుల్లో కారుమబ్బులు కనబడినాయికదా! ఇక ప్రపంచకంలో మంచి పున్నెం లేదనే తోచినదే! ఏల ఈ పాణి బ్రతికేది ?"

"సామీ! చెమించు. నాను శాకినిదా! నీ సొమ్ము ఏడ నీవు దాచేది నాకుదా తెలుసునే. అది కుప్పుసామికిదా నాను సెప్పితేనే, అది వాడుదా తీసిండు!"

పున్నెడు పక్కున నవ్వాడు. అతని హృదయంలోనూ వెన్నెలకాసింది.

"పోమెలే! ఈ పాణికి చేతులిచ్చిన యెంకన్న పున్నెమా! పది అయిదు నూర్లు సంపాదించనా? నువ్వు నా దగ్గిరే ఉండు! అంతే: నా సంసారం నువ్వు!"

పున్నెడు ఆమెను తన చేతుల్లోకి తీసుకుని తలా, కళ్ళూ ముక్కూ, చెవులూ, పెదవులూ ముద్దుపెట్టుకొన్నాడు.

అలివేలు తాను తెచ్చిన మంచినీళ్ళు కూడా పున్నెడికి నెమ్మదిగా తినిపించింది.

చుక్కలు నవ్వినవి! వెన్నెలలపతి మరీ చల్లని గాఢమయిన అడవిపూవుల పరీమళాలైన కాంతులు వాళ్ళపై అక్షతలుగా చల్లాడు.

శ్రీ వెంకటేశపతి తన ఎదుట జరిగిన వివాహాలకన్న తానే స్వయంగా జరిపిన యీ పెళ్ళి ఉత్తమమైనదనుకున్నాడా!